సాక్షి

భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం । 20 । జనవరి । 2023



ఎన్‌హెచ్‌ఆర్‌సీ బృందం పర్యటన

ములకలపల్లి, చంద్రుగొండ మండలాల్లో జాతీయ మానవ హక్కుల కమిషన్(ఎన్‌హెచ్‌ఆర్‌సీ) బృందం గురువారం పర్యటించింది. 10లో



పంట కొనుగోళ్లకు శ్రీకారం

స్వయం సహాయక సంఘాల మహిళలతో పంట ఉత్పత్తులు కొనుగోలు చేయించేలా సెర్ప్ అధికారులు ప్రణాళిక రూపొందించారు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 32° / 18°

జిల్లాలో శుక్రవారం తెల్లవారుజామున, రాత్రి చలి ప్రభావం అధికంగానే ఉంటుంది. మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు.

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



సువర్ణ పుష్పార్చన చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: మండల పరిధిలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి గురువారం 108 సువర్ణ పుష్పాలతో విశేషంగా అర్చన నిర్వహించారు. అనంతరం అమ్మవారికి మంత్రపుష్పం, నివేదన, హారతి సమర్పించారు. కార్యక్రమంలో అర్చకులు పద్మనాభశర్మ, రవికుమార్‌శర్మ పాల్గొన్నారు. కాగా, అమ్మవారి ఆలయంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు రుద్ర హోమం నిర్వహించనున్నట్లు ఈఓ రజినీకుమారి ఒక ప్రకటనలో తెలిపారు.

పెండింగ్ భూసేకరణపై నివేదికలు ఇవ్వండి

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రాజెక్టుల వారీగా భూ సేకరణ పెండింగ్‌పై నివేదికలు అందజేయాలని కలెక్టర్ అనుదీప్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ హాల్‌లో గురువారం రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీరాజ్, గిరిజన ఇంజనీరింగ్ విభాగం, సర్వే అండ్ ల్యాండ్స్ సేకరణ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వివిధ అంశాలకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియ ఫిబ్రవరి 1 నాటికి పరిష్కరించాలన్నారు. తహసీల్దార్ల పరిధిలో పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. గతేడాదికి సంబంధించి ప్రజావాణిలో రెవెన్యూ శాఖకు సంబంధించి 1764 ఫిర్యాదులు అందాయని, 1629 పరిష్కరించగా 135 పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని కూడా పరిష్కరించాలని సూచించారు. మీ సేవ నిర్వాహకులతో తహసీల్దార్లు సమావేశం నిర్వహించి మాడ్యూల్స్‌పై అవగాహన కల్పించాలని చెప్పారు. రెండు వారాల్లో డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలని అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కె.వెంకటేశ్వర్లు, డీఆర్‌ఓ అశోకచక్రవర్తి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కుసుమకుమారి, పీఆర్ ఈఈ సుధాకర్, గిరిజన సంక్షేమ శాఖ ఈఈ తానాజీ, ఈడీఎం విజయసారథి తదితరులు పాల్గొన్నారు.

బీటీపీఎస్‌లో సీఈ పరిశీలన



బీటీపీఎస్‌లో పర్యటిస్తున్న సీఈ, అధికారులు

మణుగూరుటౌన్: బీటీపీఎస్‌లోని సీడబ్ల్యూసీ హౌస్, కంప్రెషన్ హౌస్, ఎఫ్ఓ పంప్‌హౌస్ ప్రాంతాలను సీఈ బి.బిచ్చన్న గురువారం పరిశీలించారు. అక్కడ జరుగుతున్న పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పనులు సక్రమంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ ఉత్పత్తిలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. ఆయన వెంట ఎస్‌ఈ సూర్యనారాయణ, డీఈ ప్రభాకర్, చింతా రామ్మోహన్, రాజారమేష్ ఉన్నారు.

ఆదిలోనే అవాంతరం!



కొత్తగూడెంలోని ప్రభుత్వ వైద్య కళాశాల

వైద్య కళాశాలలో తరగతుల నిర్వహణ అస్తవ్యస్తం

- సపోర్టింగ్ స్టాఫ్ లేక తప్పని ఇక్కట్లు..
- 150 సీట్లకు 149 మంది విద్యార్థుల ప్రవేశాలు
- తరగతులు నడుస్తున్నా సిబ్బంది నియామకంలో నిర్లక్ష్యం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెంలో ఏర్పాటుచేసిన ప్రభుత్వ వైద్య కళాశాలకు ఆరంభంలోనే సుస్తీ చేసింది. మొదటి బ్యాచ్ విద్యార్థులకు తరగతులు ప్రారంభమైనా పర్యవేక్షణ లోపంతో ఇప్పటి వరకు కాలేజీలో పాలన గాడిన పడలేదు. దీంతో ఇక్కడ పని చేస్తున్న అధ్యాపకులకు, చదువుతున్న విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు.

సపోర్టింగ్ స్టాఫ్ ఎక్కడ..?

జిల్లాకు రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కాలేజీని మంజూరు చేసింది. 150 సీట్లకు గాను 149 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. వీరికి తరగతులు కూడా ప్రారంభమయ్యాయి. కానీ కాలేజీ నిర్వహణకు అవసరమైన సపోర్టింగ్ స్టాఫ్ నియామకం నేటికీ పూర్తి కాలేదు. గత ఐదు నెలలుగా ఈ ప్రక్రియ ఒక అడుగు ముందుకు.. నాలుగడుగులు వెనక్కు అన్న చందంగా సాగుతోంది. వైద్య కళాశాల నిర్వహణకు అవసరమైన డేటా ఎంట్రీ ఆపరేటర్, ల్యాబ్ అటెండర్, ఆఫీస్ సబార్డినేట్, థియేటర్ అసిస్టెంట్, డిసెక్షన్ హాల్ అటెండెంట్ ఇలా వివిధ విభాగాల్లో 32 పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం నుంచి మంజూరు లభించింది. వీటిని ఔట్ సోర్సింగ్ పద్ధతిన నియమించాలని నిర్ణయించారు. ఈ బాధ్యతలను ఓ ఏజెన్సీకి అప్పగించారు. ఈ మేరకు నియామకాలకు సంబంధించి మెడికల్ కాలేజీ, ఏజెన్సీల నుంచి రెండు నోటిఫికేషన్లు వెలువడగా 32 పోస్టులకు మూడు వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. ఈ క్రమంలో గతేడాది సెప్టెంబర్‌లో రాత పరీక్ష నిర్వహణకు ప్రయత్నించినప్పటికీ.. సమన్వయ లోపంతో ఆ పరీక్ష నిర్వహణ అస్తవ్యస్తంగా మారి, చివరకు రద్దయింది.

విద్యార్థులకు తప్పని ఇబ్బందులు..

ఇప్పటికే అడ్మిషన్ల సందర్భంగా సిబ్బంది లేక ఇబ్బంది పడిన విద్యార్థులకు ఇప్పుడు క్లాసుల్లోనూ అదే సమస్య ఎదురవుతోంది. ల్యాబుల్లో సరిపడా అటెండర్లు లేకపోవడంతో వివిధ కాలేజీల నుంచి అత్యవసర పద్ధతిన ల్యాబ్ స్టాఫ్‌ను పిలిపించి పాఠాలు బోధిస్తున్నారని విద్యార్థులు చెబుతున్నారు. అడ్మిషన్లు పూర్తి కాకముందే అన్ని హంగులతో కాలేజీలు సిద్ధం కావాలంటూ ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలు ఇక్కడ అమలు కావడం లేదు. తరగతులు మొదలై నెల రోజులు గడుస్తున్నా నేటికీ పాలన పూర్తిస్థాయిలో పట్టాలెక్కడం లేదు. మరోవైపు వచ్చే ఏడాది అడ్మిషన్లకు సంబంధించి కాలేజీలో ఉన్న మౌలిక వసతులు, స్టాఫ్ తదితర వివరాలతో కూడిన రిపోర్టును ఎన్‌ఎంసీకి సమర్పించాల్సి ఉంటుంది. ఎన్‌ఎంసీ బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంతృప్తి చెందితేనే మరుసటి ఏడాది అడ్మిషన్లకు అనుమతులు వస్తాయి. కానీ ఇక్కడ సపోర్టింగ్ స్టాఫ్ నియామకం పూర్తి కాకపోవడంతో ఎన్‌ఎంసీకి ఇంకా రిపోర్టు పంపలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సపోర్టింగ్ స్టాఫ్ నియామక ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని విద్యార్థులు, అధ్యాపకులు డిమాండ్ చేస్తున్నారు.

కొరవడిన స్పష్టత..

రాత పరీక్ష రద్దయి నాలుగు నెలలు గడిచినా సపోర్టింగ్ స్టాఫ్ నియామక ప్రక్రియ మాత్రం ముందుకు కదలడం లేదు. మరోసారి రాత పరీక్ష నిర్వహిస్తారా ? మార్కుల ఆధారంగా మెరిట్ లిస్ట్ తయారు చేస్తారా ? ఇంటర్వ్యూలు ఉంటాయా ఇలా ఏ విషయంలోనూ స్పష్టత లేకుండా పోయింది. గత నవంబర్‌లో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో ఈ కాలేజీ ఎంచుకున్న విద్యార్థులు ప్రవేశాలు పొందగా, తరగతులు కూడా కొనసాగుతున్నాయి. అయినా సపోర్టింగ్ స్టాఫ్ నియామకంలో మాత్రం కదలిక లేదు.

పది రోజుల్లో భర్తీ



సపోర్టింగ్ స్టాఫ్ నియామకానికి వెల్లడించిన నోటిఫికేషన్ ఆధారంగా వచ్చిన దరఖాస్తులను పరిశీలన చేసి, మెరిట్ జాబితా సిద్ధం చేస్తాం. అనంతరం రూల్స్ ఆఫ్ రిజర్వేషన్ పాటిస్తూ ఇంటర్వ్యూలు చేపడతాం. మొత్తంగా భర్తీ ప్రక్రియను వారం, పది రోజుల్లో పూర్తి చేస్తాం.

– లక్ష్మణ్‌రావు, ప్రిన్సిపాల్

విశేషం.. విశ్వరూపం



స్వామివారికి నక్షత్ర హారతి సమర్పిస్తున్న అర్చకులు

- జగదభిరాముడికి ప్రత్యేక పూజలు
- రామనామస్మరణతో మార్మోగిన భద్రగిరి
- తిలకించి.. పులకించిన భక్తజనం

భద్రాచలం: ఆలయ ప్రాంగణమంతా ధూప, దీపాల మయం.. చుట్టూ ఉత్సవ మూర్తులు, మధ్యన గరత్మంత వాహనంపై రాజాధిరాజుగా జగాలను ఏలే జగదభి రాముడి దర్శనం.. సుందర సుమనోహరమైన ఈ ఘట్టాన్ని చూసి అశేష భక్తజనం జయ జయ ధ్వానాలు చేస్తుండగా.. శ్రీ సీతారామచంద్రస్వామి వారికి విశేషంగా విశ్వరూప సేవ నిర్వహించారు. ఈ వేడుకను తిలకించిన భక్తులు తన్మయత్వంతో పులకించిపోయారు.

భద్రాద్రిలో మాత్రమే ప్రత్యేకం..

ముక్కోటి ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాలు ముగిసిన అనంతరం వచ్చే బహుళ ద్వాదశి రోజున ఈ వేడుకను నిర్వహించడం భద్రాద్రి రామాలయంలో ఆనవాయితీ. ఏ పుణ్యక్షేత్రంలోనూ ఇలాంటి వేడుక నిర్వహించరని, భద్రగిరిలోనే ప్రత్యేకమని అర్చకులు, వేద పండితులు తెలిపారు. సంవత్సర కాలంలో చేసే పూజల్లో ఏమైనా దోషాలు దొర్లితే ప్రాయశ్చిత్తం కోసం శ్రీ సీతారామలక్ష్మణ స్వామి వార్లను, ఆలయ ప్రాంగణంలోని ఉపాలయాల్లో ఉండే ఉత్సవ మూర్తులను ఒకే చోటకు చేర్చి ఏక కాలంలో సేవలు నిర్వహించడం ఈ విశ్వరూప సేవ విశిష్టత. అంతేకాక ముక్కోటి ఏకాదశి రోజున స్వామి వారిని దర్శించుకోలేని వారు ముక్కోటి దేవతలు కొలువై ఉన్న విశ్వరూప సేవ రోజున దర్శించుకున్నా ఆనాటి పుణ్యఫలం దక్కుతుందని భక్తుల నమ్మకం.

బేడామండపంలో ప్రత్యేక పూజలు..

తొలుత స్వామి వారి ఉత్సవ మూర్తులను గర్భగుడి నుంచి మంగళవాయిద్యాల నడుమ బేడా మండపానికి తీసుకొచ్చి కొలువుదీర్చారు. సువర్ణ పుష్పార్చన, వేద విన్నపాలు, దండ దీపాంజలి, హారతి, అష్టోత్తర శతనామార్చన గావించారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామి వారికి ప్రత్యేక కదంబ ప్రసాదాన్ని నైవేద్యంగా సమర్పించారు. ఈ ప్రసాదాన్ని స్వీకరిస్తే సర్వ బాధలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం.

రామచంద్రా.. రఘువీరా

విశ్వరూప సేవను పురస్కరించుకుని బేడా మండపాన్ని విద్యుత్ దీపాలు, రంగురంగుల షామియానాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అర్చకులు, వేద పండితులు 'రామచంద్ర.. రఘువీర..' 'రామచంద్ర.. రణదీర' అంటూ కీర్తనలను రాగయుక్తంగా ఆలపిస్తుండగా, భక్తులు శ్రీరామయనమః అంటూ శృతి కలిపారు. ఈ సందర్భంగా జై శ్రీరామ్ నామస్మరణలతో భద్రగిరి పులకించింది. స్వామి వారి విశ్వరూప సేవ అనంతరం ప్రసాదాన్ని స్వీకరించిన భక్తులు గర్భగుడిలో మూలమూర్తులను దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ బి.శివాజీ దంపతులు, ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజం, విజయరాఘవన్, స్థానాచార్యులు కేఈ స్థలశాయి, ఏఈఓలు శ్రవణ్‌కుమార్, భవాని రామకృష్ణ, ఈఈ రవీందర్, పర్యవేక్షకులు కత్తి శ్రీనివాస్, రామిరెడ్డి, వాసు తదితరులు పాల్గొన్నారు.



శ్రీసీతారామచంద్రస్వామి వారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, వేద పండితులు

బృహత్తర కార్యక్రమం.. కంటి వెలుగు

- పకడ్బందీగా నిర్వహించాలి
- అధికారులకు కలెక్టర్ ఆదేశం



బూర్గంపాడు : కంటివెలుగు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

బూర్గంపాడు: కంటివెలుగు కార్యక్రమం బృహత్తరమైనదని, అధికారులు పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ అనుదీప్ అన్నారు. మండలంలోని పినపాక పట్టీనగర్‌లో గురువారం ఆయన కంటి వెలుగు శిబిరాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దృష్టి లోపాలు, కంటి సమస్యలు ఉంటే వైద్యశాఖ సిబ్బంది పరీక్షించి ఉచితంగా కళ్లజోళ్లు, మందులు పంపిణీ చేస్తారని, అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతిరోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్యులు, సిబ్బంది గ్రామాల్లో కంటి పరీక్షలు నిర్వహిస్తారని, 18 ఏళ్లు పైబడిన వారంతా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ శిరీష, తహసీల్దార్ భగవాన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రుగొండ : కంటివెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జెడ్పీ సీఈఓ విద్యాలత అన్నారు. చంద్రుగొండ రైతు వేదికలో చేపట్టిన కంటివెలుగు శిబిరాన్ని గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తొలుత ఎంపీపీ బాణోత్ పార్వతి, జెడ్పీటీసీ కొడకండ్ల వెంకటరెడ్డి శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అన్నపూర్ణ, ప్రత్యేకాధికారి సంజీవరావు, డాక్టర్ తనుజ, ఐసీడీఎస్ సీడీపీఓ నిర్మలాజ్యోతి, ఎంపీటీసీ దార వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తొలిరోజు 6,203 మందికి పరీక్షలు

చుంచుపల్లి: జిల్లాలో తొలిరోజు కంటి వెలుగు కార్యక్రమంలో 6,203 మందికి పరీక్షలు నిర్వహించారు. 36 గ్రామ పంచాయతీలు, 12 మున్సిపల్ వార్డుల్లో మొదటి రోజు కంటి వెలుగు శిబిరాలను ప్రారంభించారు. 6,203 మందికి పరీక్షలు చేసి, 2,404 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. మరో 860 మందికి అధిక దృష్టిలోపం ఉందని గుర్తించి, ఆన్‌లైన్‌లో కళ్లజోళ్లకు ఆర్డర్ చేశారు. ఆయా నియోజకవర్గాల పరిధిలోని శిబిరాలకు ఎమ్మెల్యేలు వనమా వెంకటేశ్వరరావు, రేగా కాంతారావు, మెచ్చా నాగేశ్వరరావు, పొదెం వీరయ్య, హరిప్రియ, లావుడ్యా రాములునాయక్ హాజరై బాధితులకు కళ్లద్దాలు పంపిణీ చేశారు.



కంటి పరీక్ష చేయించుకుంటున్న ఎమ్మెల్యే హరిప్రియ

ఎమ్మెల్యే హరిప్రియకు స్వల్ప దృష్టి లోపం

ఇల్లెందు: ఇల్లెందులోని మెప్మా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరంలో స్థానిక ఎమ్మెల్యే హరిప్రియ గురువారం పరీక్ష చేయించుకున్నారు. ఆమెకు మైల్డ్ దృషి లోపం ఉన్నట్లు తేలడంతో కళ్లజోడు వాడాలని వైద్యులు సూచించారు. త్వరలోనే కళ్లజోడు అందజేస్తామని చెప్పారు. దీంతో రెగ్యులర్‌గా కళ్లజోడు వాడుతానని ఎమ్మెల్యే తెలిపారు.

మావోయిస్టుల కదలికపై నిఘా పెట్టాలి

- శాంతిభద్రతల పరిరక్షణలో బాధ్యతగా వ్యవహరించండి
- పోలీసు సిబ్బందికి ఐజీ చంద్రశేఖర్ రెడ్డి ఆదేశం



మాట్లాడుతున్న ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, పక్కన ఎస్పీ వినీత్ తదితరులు

కొత్తగూడెంటౌన్: మావోయిస్టుల కదలికలపై నిరంతరం నిఘా ఏర్పాటు చేసి కట్టడికి చర్యలు చేపట్టాలని, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని మల్టీ జోన్–1 ఐజీ ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన జిల్లాకు రాగా, ఎస్పీ వినీత్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. సాయుధ దళాల గౌరవ వందనం స్వీకరించిన ఐజీ.. ఆ తర్వాత ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. నిషేధిత మావోయిస్టుల కార్యకలాపాలకు చెక్ పెట్టాలని సూచించారు. వారి సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. అనంతరం పాల్వంచ నవభారత్‌లో నిర్మిస్తున్న జిల్లా పోలీసు కార్యాలయ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(ఆపరేషన్స్) టి.సాయిమనోహర్, ఏఎస్పీలు రోహిత్‌రాజు, అక్షాంశ్‌యాదవ్, కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు, పాల్వంచ డీఎస్పీలు వెంకటేశ్వర్‌బాబు, రమణమూర్తి, రాఘవేంద్రరావు, సత్యనారాయణ, డీసీఆర్బీ డీఎస్పీ నందీరామ్, ఏఆర్ డీఎస్పీ విజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'ఏజెంట్ టు కలెక్టర్ కోర్టు'

సూపర్‌బజార్(కొత్తగూడెం): నూతన కలెక్టరేట్‌లో శుక్రవారం మధ్యాహ్నం 3గంటలకు ఏజెంట్ టు కలెక్టర్ కోర్టు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీఆర్‌ఓ అశోకచక్రవర్తి గురువారం తెలిపారు. న్యాయవాదులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

లైజన్ ఆఫీసర్ల నియామకం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి యాజమాన్యం నాలుగు ఏరియాల్లో లైజన్ ఆఫీసర్లను నియమించింది. ఈనెల 18న ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎస్సీ ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నేత ఆంతోటి నాగేశ్వరరావు గురువారం తెలిపారు. రామగుండం–2 ఏరియాలో పర్సనల్ డీజీఎం జి.రాజేంద్రప్రసాద్‌ను, బెల్లంపల్లి ఏరియాలో డీవైపీఎం రెడ్డిమల్ల తిరుపతిని, ఇల్లెందు ఏరియాలో జేకే ఓసీ ఈఈ కన్నూరి శ్రీనివాస్‌ను, ఎస్టీపీపీ ఎస్‌ఈ కొండ వెంకటయ్యను నియమించినట్లు పేర్కొన్నారు.

సమన్వయంతో సక్సెస్

- బీఆర్‌ఎస్ ఆవిర్భావ సభపై నేతల ఖుషీ
- వైరం వీడి సభ బాట పట్టిన పలువురు..
- వేర్వేరుగానైనా జన సమీకరణ చేసిన ఇంకొందరు
- ఉమ్మడి జిల్లా నేతలను అభినందించిన సీఎం కేసీఆర్

సాక్షిప్రతినిధి, ఖమ్మం: అధికార టీఆర్‌ఎస్.. బీఆర్‌ఎస్‌గా రూపాంతరం చెందాక ఖమ్మంలో నిర్వహించిన తొలి సభ ఉమ్మడి జిల్లాలోని పలు నియోజకవర్గాల నేతలను ఒకేదారిలో నడిపించింది. సభకు పది రోజుల ముందు వరకు పలుచోట్ల నేతల మధ్య తారాస్థాయిలో ఉన్న వైరం కొంత చల్లబడింది. ఎవరికి వారు బల ప్రదర్శన చాటేలా జన సమీకరణ చేయడంతో సభ సక్సెస్ అయిందని పార్టీ నాయకత్వం భావిస్తోంది. రాష్ట్ర మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారథిరెడ్డి, మాలోతు కవిత, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు తాత మధుసూదన్, విప్ రేగా కాంతారావు చేసిన ప్రయత్నాలతో సభకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కేడర్ కదిలింది.

వద్దిరాజు ఇంట్లో మకాం

ఖమ్మం కేంద్రంగా బీఆర్‌ఎస్ తొలి సభకు సీఎం కేసీఆర్ ముహూర్తం నిర్ణయించడమే కాక కీలక బాధ్యతలను మంత్రులు హరీశ్‌రావు, పువ్వాడకు అప్పగించారు. దీంతో పార్టీలో ట్రబుల్ షూటర్‌గా పేరొందిన హరీశ్‌రావు జిల్లాలో వారం పాటు మకాం వేశారు. ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఇంట్లో ఉంటూ నియోజకవర్గాల వారీగా సమీక్షించిన ఆయన ఎక్కడెక్కడ నేతల మధ్య పొసగడం లేదో వారిని కూర్చోబెట్టి మాట్లాడారు. సభ సక్సెస్ చేసేలా ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులతో వద్దిరాజు ఇల్లే వేదికగా చర్చలు చేశారు. అంతేకాకుండా సభకు ముందు రోజే మిగతా జిల్లాల మంత్రులు, ప్రజాప్రతినిధులు ఖమ్మం చేరుకోవాలన్న సీఎం కేసీఆర్ ఆదేశాలతో చాలామంది రాగా, వద్దిరాజు ఇంట్లోనే ఉండి జనసమీకరణపై దృష్టి సారించారు.

వైరాలో ఆ ముగ్గురు

వైరా నియోజకవర్గంలో ఎమ్మెల్యే రాములునాయక్, మాజీ ఎమ్మెల్యేలు బాణోతు మదన్‌లాల్, చంద్రావతి ఎవరికి వారు వర్గాలుగా కొనసాగుతున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేగా తనకే టికెట్ వస్తుందని ఎమ్మెల్యే రాములునాయక్ ధీమా వ్యక్తం చేస్తుండగా, బలంగా ఉన్న తమకే టికెట్ వస్తుందని మిగతా ఇద్దరు ఆశిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఆవిర్భావ సభ వీరిని ఒకే వేదికపై చేర్చింది. జన సమీకరణ కోసం వైరాలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ముగ్గురు పాల్గొని తమ వర్గీయులను సభకు తరలించడం ద్వారా బలప్రదర్శన కొనసాగించారు.

పాలేరు నుంచి కందాల, తుమ్మల

సభ సందర్భంగా పార్టీ అధిష్టానం మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ప్రాధాన్యతనిచ్చింది. మంత్రి హరీశ్‌రావు నేరుగా తుమ్మల ఇంటికి వెళ్లడం .. ఆతర్వాత కొత్తగూడెంలో సీఎం కార్యక్రమానికి తుమ్మల హాజరు కావడం వంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి. 'తుమ్మల నేతృత్వంలో ఆవిర్భావ సభకు జన సమీకరణ చేస్తున్నామని, సీనియర్ నేతగా ఉన్న ఆయన సలహాలు, సూచనలు ఇవ్వాలని' అని సత్తుపల్లి సమావేశంలో మంత్రి హరీశ్‌రావు ప్రకటించారు. పార్టీ ఇచ్చిన సూచనలతో తుమ్మల కూడా పలు నియోజకవర్గాల సన్నాహక సమావేశాలకు హాజరుకావడంతో పాలేరు నియోజకవర్గం నుంచి ఆయన అనుచరవర్గం, కేడర్ సభకు తరలివచ్చింది. మరోపక్క ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి సైతం సభను ప్రతిష్టాత్మకంగా తీసుకొని కేడర్‌ను తరలించారు. కాగా, మంత్రి ప్రశాంత్‌రెడ్డి ఇటీవల పర్యటన సందర్భంగా 'ఉపేందర్‌రెడ్డి గెలుపును ఎవరూ ఆపలేరు' అని వ్యాఖ్యానించడాన్ని కందాల వర్గం విస్తృతంగా ప్రచారం చేసుకుంది.

'గూడెం'లో జలగం చర్చ

గత ఎన్నిల్లో కొత్తగూడెం టీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిన జలగం వెంకట్రావు కొంత కాలం నుంచి స్తబ్దుగా ఉన్నారు. అయితే, ఖమ్మం సభకు హాజరు కావాలని పార్టీ అధిష్టానం నుంచి ఆయనకు ఆహ్వానం అందడం విశేషం. బీఆర్‌ఎస్ సభావేదిక పైకి ఆయన కూడా వచ్చారు. ఈ పరిణామాలతో ఇంతకాలం గుంబనంగా ఉన్న జలగం రీ ఎంట్రీతో కొత్తగూడెంలో రాజకీయంగా చర్చ జరుగుతోంది.



మంత్రి అజయ్, ఎంపీ వద్దిరాజును అభినందిస్తున్న సీఎం కేసీఆర్

మీతో భోజనం చేస్తా...

జిల్లాలో సభ సక్సెస్ కావడంపై ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లా నేతలను అభినందించారు. మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌తో పాటు, ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారథిరెడ్డి, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలందరినీ ప్రశంసించారు. 'త్వరలో మీ అందరూ ప్రగతిభవన్‌కు రావాలి, మీతో భోజనం చేస్తా' అంటూ సీఎం పలువురికి ఫోన్‌లో చెప్పినట్లు తెలిసింది. అలాగే మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీ వద్దిరాజు గురువారం ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలవగా.. అద్భుతంగా సభ నిర్వహించారని అభినందించడమే కాక వచ్చే ఎన్నికల్లోనూ టీం వర్క్‌గా చేయాలని సూచించారు.

క్లుప్తంగా

మరింత శ్రద్ధ అవసరం



విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ములకలపల్లి: విద్యార్థులు సామర్థ్యాలు సాధించడంలో ఉపాధ్యాయుల కృషి ఆశించిన స్థాయిలోలేదని, మరింత శ్రద్ధపెట్టి పిల్లల్లో కనీస సామర్థ్యాలు పెంపొందించాలని జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి నాగరాజు శేఖర్, జిల్లా సమ్మిళిత విద్యా కో–ఆర్డినేటర్ సైదులు పేర్కొన్నారు. మండల పరిధిలోని సీతారాంపురం, పూసుగూడెం, ఒడ్డురామవరం, పాతూరు పాఠశాలలను గురువారం వారు సందర్శించారు. తొలిమెట్టు కార్యక్రమం అమలు తీరును పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. పూసుగూడెం, ఒడ్డురామవరం పాఠశాల్లో జరుగుతున్న మనఊరు – మనబడి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాలు సాధించడంలో వెనుకబడి ఉండడం దురదృష్టకరమని అన్నారు. ఉపాధ్యాయులు కాలనిర్ణయ పట్టిక ఆధారంగా, తయారుచేసుకున్న పాఠ్యప్రణాళిక ఆధారంగా పాఠాలు బోధించాలని సూచించారు. నోడల్ అధికారి యోగితావేణి పాల్గొన్నారు.

21, 22వ తేదీల్లో బాలోత్సవ్

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం క్లబ్‌లో ఈ నెల 21, 22వ చిల్డ్రన్స్ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే బాలోత్సవ్‌ను విజయవంతం చేయాలని గురువారం జాతీయ బాలోత్సవ్ కన్వీనర్ డాక్టర్ రమేష్‌బాబు ఒక ప్రకటనలో కోరారు. తెలుగు భాషపై ఆసక్తి కలిగిన విద్యార్థులకు రచనల పట్ల మరింతగా ఆసక్తిని కలిగించాలని ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 8,9,10 తరగతుల విద్యార్థులకు నిర్వహించే ఈ పోటీలకు తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రముఖ కవులు, కథకులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరిస్తారని తెలిపారు. డీఈఓ హాజరవుతారని పేర్కొన్నారు.

దర్గాలో ఎమ్మెల్యే ప్రార్థనలు



బేతంపూడి దర్గాలో తమ కుమార్తెతో ఎమ్మెల్యే దంపతులు

టేకులపల్లి: ఇల్లెందు ఎమ్మెల్యే బాణోతు హరిప్రియ, హరిసింగ్ నాయక్ దంపతులు గురువారం బేతంపూడి దర్గాను సందర్శించారు. దర్గాలో బుధవారం ఉర్సు వేడుకలు ప్రారంభమయ్యాయి. కాగా ఎమ్మెల్యే దంపతులు తమ కుమార్తెతో వచ్చి హజరత్ సయ్యద్ జమాలుద్దీన్ బీహారీ బాబాకు పూలు, పండ్లు, స్వీట్లు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కె.పాషా, ఎస్‌కె ఫరీద్, ఖయ్యూమ్, జానీ, ఖాజా మొయినుద్దీన్, ఎండి.సాబీర్, నదీమ్,సలీం, షఫీ, షకీల్, జమాల్, పాషా, శ్రీను, షఫీ, జాటోత్ నరేష్, అంతోటి రాకేష్, కాలె అభినయ్ తదితరులు పాల్గొన్నారు.


అత్యాచారయత్నం కేసు నమోదు

దమ్మపేట: అత్యాచార ఘటనలో గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... మండల పరిధిలోని వడ్లగూడెం గ్రామానికి చెందిన చల్లా దిలీప్ ఈ నెల 3న అదే గ్రామానికి చెందిన ఓ వివాహితను తన పామాయిల్ క్షేత్రంలో కూలి పనులకు తీసుకెళ్లాడు. వ్యవసాయ పనులు చేస్తుండగా అత్యాచారానికి యత్నించాడు. ఆమె కేకలు వేయడంతో నిందితుడు పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

గాయపడ్డ యువకుడి మృతి

టేకులపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుడు బుధవారం రాత్రి మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని మద్రాస్‌తండాకు చెందిన యువకుడు బాదావత్ దస్రు (26) ఈ నెల 12న పిండి పట్టించేందుకు కాలినడకన కోయగూడెం వెళ్లొస్తున్నాడు. ఈ క్రమంలో బొలెరో వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబీకులు చికిత్స నిమిత్తం కొత్తగూడెం ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తీసుకెళ్లారు. అక్కడి నుంచి కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి బుధవారం రాత్రి తీసుకొస్తుండగా మృతి చెందాడు. మృతుడికి తల్లి, సోదరుడు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ భూక్యా శ్రీనివాస్ తెలిపారు.

బెంగళూరు ప్రమాదంలో ఎమ్మెల్సీ బంధువు మృతి



నిఖిల్ (ఫైల్)

తిరుమలాయపాలెం: బెంగళూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ సోదరుడు విశ్వేశ్వరరావు కుమారుడు తాతా నిఖిల్(27) మృతి చెందాడు. పిండిప్రోలుకు చెందిన విశ్వేశ్వరరావు కుమారుడు నిఖిల్ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. గురువారం ఉదయం ఆయన బైక్‌పై విధులకు వెళ్తుండగా లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. నిఖిల్ మృతదేహాన్ని శుక్రవారం పిండిప్రోలుకు తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

పంట కొనుగోళ్లకు శ్రీకారం

పంట ఉత్పత్తుల వ్యాపారంలోకి స్వయం సహాయక గ్రూపులు

- సభ్యులైన మహిళా రైతులతో ఉత్పతిదారుల సంఘాలు ఏర్పాటు
- ప్రయోగాత్మకంగా మూడు మండలాల్లో ఏడు కేంద్రాలు..
- సెర్ప్ పర్యవేక్షణలో తొలి దశలో మిర్చి కొనేందుకు సన్నాహాలు



క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలిస్తున్న సెర్ప్ అధికారులు

ఇల్లెందురూరల్: స్వయం సహాయక(పొదుపు) సంఘాల మహిళలు వివిధ రూపాల్లో తీసుకుంటున్న రుణాలను వ్యవసాయానికి పెట్టుబడిగా పెట్టి అత్యల్ప లాభాలతో తిరిగి చెల్లించలేకపోతున్నారు. ఈ పరిస్థితిని అధిగమించి లాభాలు గడించేలా సెర్ప్ అధికారులు ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. మహిళా రైతు ఉత్పతిదారుల సంఘాలు నెలకొల్పారు. సంఘాల ఆధ్వర్యంలో వ్యవసాయంపై శిక్షణ ఇస్తూనే వారిచేతనే పంట ఉత్పత్తుల కొనుగోళ్లకు శ్రీకారం చుట్టారు. జిల్లాలో ప్రయోగాత్మకంగా మూడు మండలాల్లో మహిళా రైతు ఉత్పత్తిదారుల ఆధ్వర్యంలో ఏడు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈనెలాఖరులోగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేందుకు సెర్ప్ అధికారులు సిద్ధమవుతున్నారు.

ప్రయోగాత్మకంగా ఏడు కేంద్రాలు..

జిల్లాలోని ఇల్లెందు మండలంలో 19, టేకులపల్లిలో 14, చంద్రుగొండలో 14 మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేశారు. ఆయా సంఘాల ఆధ్వర్యంలో పంట ఉత్పత్తుల కొనుగోలు చేయనున్నారు. ఇల్లెందు మండలంలో కొమరారం, మాణిక్యారం, టేకులపల్లి మండలంలో కుంటల్ల, టేకులపల్లి, సులానగర్, చంద్రుగొండ మండలంలో తోకలగూడెం, రవికంపాడు గ్రామాల్లో ఈ నెలాఖరు నాటికి కొనుగోళ్లు ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

క్షేత్రస్థాయిలో పంటల సర్వే

గ్రామాల్లో మహిళా రైతు సంఘాల సభ్యులతోపాటు రైతులు సాగు చేస్తున్న పంటలపై సెర్ప్ అధికారులు సర్వే నిర్వహించారు. మిర్చి కొనుగోలు చేసేందుకు నిర్ణయించడంతో ఆదిశగా పంట సర్వే చేపట్టారు. తొలి దఫాగా రైతు ఉత్పత్తిదారుల సంఘాల సభ్యులైన రైతులను కలిసి సాగు విస్తీర్ణం, దిగుబడిపై ఒక అంచనాకు వచ్చారు. ఇల్లెందు మండలంలో 588.1 ఎకరాలు, టేకులపల్లిలో 467.5 ఎకరాలు, చంద్రుగొండలో 348.9 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేస్తున్న 939 మంది రైతులను కలిసి కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై అవగాహన కల్పించారు. ఆయా విస్తీర్ణంలో మొత్తంగా 21,573 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా వేశారు.

కేంద్రానికో కమిటీ..

గ్రామస్థాయిలో ఏర్పాటు చేస్తున్న ప్రతి కొనుగోలు కేంద్రానికి ఒక కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ సంఘం సహాయకురాలు, వీవో యాక్టివ్ మెంబర్, కొనుగోలు కేంద్రం మేనేజర్, 50 మంది మహిళా రైతు ఉత్పత్తిదారులు, పంట కొనుగోలు చేసే సంస్థ ప్రతినిధి, క్లస్టర్ సీసీ, రైతు ఉత్పత్తిదారుల సంఘం సీఈఓ తదితరులు ప్రతినిధులుగా ఉంటారు.

కొనుగోళ్లలో నాణ్యతకు ప్రాధాన్యం..

క్షేత్రస్థాయిలో ముందస్తుగా చేసిన సర్వే ఆధారంగా తొలి దశలో రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు సంబంధించిన దిగుబడులను కొనుగోలు చేస్తారు. ఆ తర్వాత ఇతర రైతుల పంటలను కొనుగోలు చేస్తారు. పంట కొనుగోలు విషయంలో నాణ్యతా ప్రమాణాలకు ప్రాధాన్యమిస్తారు. నాణ్యత పరిశీలన అనంతరం డీలక్స్, బెస్ట్, మీడియం, యావరేజ్ రకాలుగా విభజిస్తారు. ఆయా గ్రేడింగ్‌ల ఆధారంగా పంట కల్లాల వద్దే జెండాపాట నిర్వహిస్తారు. అనంతరం పంటకు ధరను నిర్ణయించి రైతుకు సమాచారం ఇస్తారు. ఇలా జెండాపాట పూర్తైన పంటను 48 గంటల్లో కొనుగోలు కేంద్రాల వద్దకు రైతులే తరలించాల్సి ఉంటుంది. ప్రతిరోజు నిర్వహించే జెండా పాట ఆధారంగా ఐదురోజుల సరాసరిని లెక్కించి ఆ రోజు ధరను నిర్ణయిస్తారు. ఇలా కొనుగోలు చేసిన పంటకు వారం రోజుల వ్యవధిలో సొమ్ములు చెల్లిస్తారు.

ప్లాంట్ లిపిడ్ కంపెనీతో ఒప్పందం

రైతుల వద్ద కొనుగోలు చేసిన పంటలను తిరిగి మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘాల నుంచి కొనుగోలు చేసేలా కేరళ రాష్ట్రం కొచ్చిన్ ప్రాంతానికి చెందిన ప్లాంట్ లిపిడ్ కంపెనీతో సెర్ప్ అధికారులు ఇప్పటికే ఒప్పందం చేసుకున్నారు. ప్రస్తుతం ఈ కంపెనీ కార్యాలయం మహబూబాబాద్ జిల్లా కురవి మండలం సమీపంలోని మన్నెగూడెం గ్రామంలో ఏర్పాటు చేశారు.

లాభాలు రైతు ఉత్పత్తిదారుల సంఘాలకే..

తొలిదఫాగా మిర్చి కొనుగోలు ప్రారంభిస్తున్నా భవిష్యత్తులో అన్ని రకాల పంటలు కొనుగోలు చేసేలా అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ద్వారా గడించిన లాభాలను రైతు ఉత్పత్తిదారుల సంఘాలకే అప్పగించనున్నారు. అత్యధిక లాభాలు సమకూరితే విక్రయించిన రైతులకు కూడా వాటా కేటాయించేలా అధికారులు ప్రణాళిక రూపొందించారు. మరింత నాణ్యమైన దిగుబడులు సాధించేలా మహిళా రైతులకు ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వనున్నారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ వ్యవసాయం చేసేలా రైతులను ప్రోత్సహించనున్నారు.

మహిళా రైతులను ప్రోత్సహిస్తాం



ప్రతి గ్రామం నుంచి మహిళా రైతులను గుర్తించి రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేశాం. సంఘాల సభ్యుల చేత పంట ఉత్పత్తుల కొనుగోలు కేంద్రాలను ఈ నెలాఖరులో ప్రారంభిస్తున్నాం. మహిళా రైతులు గిట్టుబాటు ధర పొందడంతోపాటు లాభాలు గడించి నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకునేలా ప్రోత్సహిస్తున్నాం.

– దుర్గారావు, ఏపీఎం, ఇల్లెందు మండలం

భూ నిర్వాసితుల జలదీక్ష



గోదావరిలో దీక్ష చేస్తున్న కోరెగడ్డ భూ నిర్వాసితులు

చర్ల: కోరెగడ్డ భూ నిర్వాసితులు గురువారం గోదావరి నదిలో జలదీక్ష చేపట్టారు. సీతమ్మ సాగర్ ప్రాజెక్ట్ కోసం చర్ల మండలంలోని కొత్తపల్లి, లింగాపురం గొంపల్లి గ్రామస్తులకు కోరెగడ్డకు సమీపంలో ఉన్న భూములను తీసుకుని పరిహారం ఇవ్వకపోవడంపై నిర్వాసితుల పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. భూములకు సమీపంలో ఉన్న గోదావరిలో మూడు గంటలపాటు నిల్చొని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు కొండా చరణ్ మాట్లాడుతూ ఏళ్ల తరబడి కోరెగడ్డ భూములను సాగు చేసుకుంటున్న కుటుంబాలను సీతమ్మసాగర్ బహుళార్ధ సాధక ప్రాజెక్ట్ నిరాశ్రయులను చేస్తోందని పేర్కొన్నారు. పట్టాలు లేవనే సాకుతో ప్రభుత్వం సాగు భూములను లాక్కుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. కోరెగడ్డ భూముల్లో ఎంజాయ్‌మెంట్ సర్వే నిర్వహించాలని, 2013 భూసేకరణ చట్టం ప్రకారం రైతు కూలీలకు నష్టపరిహారం చెల్లించాలని, ఎకరాకు రూ.8 లక్షల నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాసితులు, రైతు కూలీలు పాల్గొన్నారు.

బీజేపీ వ్యతిరేక శక్తులతో కలిసి పనిచేస్తాం..

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

చంద్రుగొండ : బీజేపీ వ్యతిరేక శక్తులతో కలిసి పని చేస్తామని, కమ్యూనిస్టులు లేనిదే దేశానికి భవిష్యత్ లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. మండల కేంద్రం చంద్రుగొండలోని ఆ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీని బీఆర్ఎస్ వ్యతిరేకిస్తున్న నేపథ్యంలోనే ఖమ్మం బీఆర్ఎస్ సభలో పాల్గొన్నామని తెలిపారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీజేపీ వ్యతిరేక శక్తులతో కలిసి పనిచేస్తామన్నారు.

శ్రీనివాసరావు మృతి పార్టీకి తీరనిలోటు

సీపీఎం సీనియర్ నాయకుడు వంకాయలపాటి శ్రీని వాసరావు మృతి పార్టీకి తీరని లోటని తమ్మినేని వీరభద్రం పేర్కొన్నారు. శ్రీనివాసరావు ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందగా, గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, కాసాని ఐలయ్య, కొండపల్లి శ్రీధర్, అన్నవరపు సత్యనారాయణ, మండల నాయకులు ఐలూరి రామిరెడ్డి, యాస నరేష్, పెద్దిని వేణు, ఆర్.వెంకటారి, విప్పర్ల వెంకటేశ్వర్లు, రాయి రాజా పాల్గొన్నారు.

'జేవీఆర్' మోటార్లు ప్రారంభం



మోటారును పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

ములకలపల్లి: జలగం వెంగళరావు (జేవీఆర్) మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని గంగారం, సంద్రకుంట గ్రామాల్లో సబ్సిడీపై రైతులకు అందించిన వ్యవసాయ మోటార్లను గురువారం తెలంగాణా రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి అధ్యక్షుడు తన్నీరు శ్రీరంగారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయరంగాన్ని ప్రగతిపథంలో నడిపించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ మెంబర్ ఎండీ మనోహర్‌రాజు, ఫైనాన్స్ మెంబర్ బండారు కృష్ణయ్య, జేవీఆర్ ట్రస్ట్ బాధ్యులు జలగం ప్రసాదరావు, కొత్తగూడెం ఎస్ఈ రమేశ్, డీఈ శేషాద్రి, ఏడీఈ లక్ష్మణ్, ఏఈ లక్ష్మీనర్సింహారావు, ఎంపీటీసీలు మడకం విజయ, తాటి తులసి, సున్నం సునీత, టీఆర్ఎస్ నాయకులు తాండ్ర రాంబాబు తదితరులు ఉన్నారు.

విద్యార్థి అదృశ్యం



ఇక్బాల్

పాల్వంచ: సరిగ్గా చదవడం లేదని తండ్రి మందలించడంతో 8వ తరగతి విద్యార్థి అదృశ్యమయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన ఎండి.షఫీ అహ్మద్ కుమారుడు ఇక్బాల్(అనస్) నవభారత్ పబ్లిక్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. సరిగ్గా చదవకపోవడంతో షఫీ గురువారం మధ్యాహ్నం పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయులను, కుమారుడిని మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన ఇక్బాల్ సాయంత్రం 5 గంటలకు ఇంటికి చేరుకుని, రూ.90 వేల నగదు, దుస్తులు తీసుకుని సైకిల్‌పై బయటకు వెళ్లిపోయాడు. ఎక్కడ వెతికినా ఆచూకీ లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని, నాలుగు బృందాల ద్వారా విద్యార్థి కోసం గాలిస్తున్నామని ఎస్ఐ ప్రవీణ్ తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

దమ్మపేట: మండల పరిధిలోని మందలపల్లి గ్రామం ప్రకాష్ నగర్ కాలనీలో పేకాట నిర్వహిస్తున్న శిబిరంపై పోలీసులు దాడి చేసి కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... గురువారం మందలపల్లి గ్రామ పరిధిలోని ప్రకాష్ నగర్ కాలనీలో పేకాట ఆడుతున్నారని విశ్వసనీయ సమాచారం పోలీసులకు అందింది. దీంతో ఎస్సై శ్రావణ్‌కుమార్ తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. రూ.9వేలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్సై తెలిపారు.

డీఏఈఎస్ఐ కోర్సు అభ్యర్థులకు వార్షిక పరీక్షలు



పరీక్ష రాస్తున్న అభ్యర్థులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ సర్వీస్ ఫర్ ఇన్‌పుట్ (డీఏఈఎస్ఐ) కోర్సుకు సంబంధించిన నాలుగు, ఐదు బ్యాచ్‌ల డీలర్లకు గురువారం వార్షిక పరీక్షలను నిర్వహించారు. జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ పర్యవేక్షణలో లోతువాగు రైతువేదికలో పరీక్షలు జరిపారు. వీరికి శిక్షణా తరగతులతో పాటు క్షేత్ర స్థాయిలో తర్ఫీదునిచ్చారు. వార్షిక పరీక్షల్లో భాగంగా స్పాట్ ఐడెంటిఫికేషన్, వైవా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరీక్షల పర్యవేక్షకుడు అరవింద, జిల్లా వ్యవసాయాధికారి కొర్స అభిమన్యుడు, ఇతర అధికారులు జి.లాల్‌చంద్, దీపక్ ఆనంద్, డేవిడ్ జైపాల్, దామోదర్‌రెడ్డి, డీలర్లు పాల్గొన్నారు.

మున్నేరుపై కేబుల్ బ్రిడ్జి..

పాత బ్రిడ్జి స్థానంలో కేబుల్ బ్రిడ్జి

- రూ.180 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు
- సీఎం ప్రకటించిన మరుసటిరోజే నిధులు
- ఖమ్మం నగరంలో తీరనున్న ట్రాఫిక్ సమస్య



ప్రస్తుత మున్నేరు బ్రిడ్జి

మున్నేరుపై 420మీటర్ల పొడవుతో బ్రిడ్జి నిర్మిస్తారు. ఇందులో 300 మీటర్లు కేబుల్‌పై, 120 మీటర్లు ఆర్‌సీసీపై ఉంటుంది. ఇందుకోసం రూ.180 కోట్లు మంజూరు చేయగా.. బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే ప్రజా రవాణా ఇబ్బందులు తీరడమే కాక నగరానికి కొత్త అందం సంతరించుకోనుంది.



కరీంనగర్‌లో మానేరుపై నిర్మించిన కేబుల్ బ్రిడ్జి (ఫైల్)

సాక్షిప్రతినిధి, ఖమ్మం: హైదరాబాద్‌లోని దుర్గం చెరువు, కరీంనగర్‌లోని మానేరుపై నిర్మించిన కేబుల్ బ్రిడ్జి తరహాలో ఖమ్మంలోని మున్నేరుపై బ్రిడ్జి నిర్మాణం కానుంది. ఇది రాష్ట్రంలోనే మూడో బ్రిడ్జి కానుండగా.. ఇందుకోసం రూ.180 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. నగరంలోని నయాబజార్ వద్ద మున్నేరుపై బ్రిటీష్ కాలంలో బ్రిడ్జి నిర్మించారు. రాను రాను నగరం విస్తరించడం, వాహనాల రద్దీ పెరగడంతో అవసరాలకు అనుగుణంగా బ్రిడ్జి సేవలు అందించలేకపోతోంది. ఈ కారణంగా నూతన బ్రిడ్జి నిర్మించాలనే ఉద్దేశంతో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో బీఆర్ఎస్ సభ సందర్భంగా ముఖ్యమంత్రి గ్రీన్‌సిగ్నల్ ఇవ్వగా.. గురువారం నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్.. కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

బ్రిటీష్ కాలం నుంచి..

ఖమ్మం నగరంలో మున్నేరుపై బ్రిటీష్ కాలంలో వంతెన నిర్మించారు. అప్పటి నుంచి ఖమ్మం నుంచి హైదరాబాద్, వరంగల్, నల్లగొండ, మిర్యాలగూడ తదితర నగరాలకు రాకపోకలకు వారధిగా నిలుస్తోంది. ఈ బ్రిడ్జి ప్రాంతంలోనే బస్టాండ్, విద్య, వైద్య సంస్థలు ఉండటంతో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి రాకపోకలతో రద్దీ కనిపిస్తుంది. రానురాను నగరానికి వచ్చే జనాభా పెరగడంతో తరచూ ట్రాఫిక్ జామ్ ఎదురవుతోంది. బ్రిడ్జి వెడల్పు తక్కువగా ఉండడంతో ప్రమాదాలు, వర్షాకాలంలో వరద ఉధృతితో మున్నేరు బ్రిడ్జికి ప్రమాదం పొంచి ఉందనే ప్రచారం జరుగుతోంది. కాగా, రాపర్తినగర్ వద్ద మరో బ్రిడ్జి నిర్మించినా అవసరాలు తీరడం లేదని భావించిన మంత్రి పువ్వాడ కొత్త బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదించారు. ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆర్‌అండ్ బీ అధికారులకు సూచించడమే కాక, కొత్త బ్రిడ్జి అవసరాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు.

సీఎంకు మంత్రి పువ్వాడ కృతజ్ఞతలు

మున్నేరు బ్రిడ్జి నిర్మాణానికి నిధులు విడుదల చేయడంపై రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ సభ సందర్భంగా హామీ ఇచ్చిన సీఎం ఆ వెంటనే నిధులు విడుదల చేయడంతో కేసీఆర్‌ను హైదరా బాద్‌లో కలిసి నగర ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఇక ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర కూడా ప్రకటించిన 24గంటల్లో నిధులు మంజూరు చేసిన సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

హామీ.. ఆ వెంటనే నిధులు

ఖమ్మంలో బుధవారం బీఆర్ఎస్ సభ సందర్భంగా జిల్లాపై ముఖ్యమంత్రి కేసీఆర్ వరాల జల్లు కురిపించారు. జిల్లాలోని 589 గ్రామపంచాయతీలతోపాటు ఐదు మేజర్ గ్రామపంచాయతీలకు, ఖమ్మం సహా నాలుగు మున్సిపాలిటీలకు కలిపి రూ.248.90 కోట్ల నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల, మున్నేరుపై బ్రిడ్జి నిర్మాణాన్ని చేపడతామని తెలిపారు. అయితే హామీ ఇచ్చిన మరుసటి రోజే మున్నేరుపై బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తూ పరిపాలనా అనుమతులు రావడం విశేషం. హైదరాబాద్‌లోని దుర్గం చెరువు, కరీంనగర్ మానేరు తరహాలో ఈ బ్రిడ్జి నిర్మాణం చేపట్టనుండగా.. ఇది రాష్ట్రంలోనే మూడో కేబుల్ బ్రిడ్జి. నిధుల మంజూరుపట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పురుగుల మందు తాగి బాలిక మృతి

గుండాల: తల్లిదండ్రులు మందలించారని మనస్తాపం చెంది పురుగుల మందు తాగిన బాలిక గురువారం మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని ముత్తాపురం గ్రామానికి చెందిన స్నేహలత (16) ఇల్లెందులో ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుతోంది. ఇటీవల సంక్రాంతి సెలవులు రావడంతో బంధువుల ఇంటికి వెళ్లింది. ఆ తర్వాత ఇంటికి రావడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో మూడు రోజుల క్రితం పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి గుండాల ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం మృతి చెందింది. ఎస్సై రాజశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ఉరి వేసుకుని వ్యక్తి..

అశ్వాపురం: మండల పరిధిలోని అమ్మగారిపల్లి గ్రామంలో భారజల కర్మాగారం రక్షణ పరిధి(కంచె) లోపల చెట్టుకు ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. చెట్టుకు వేలాడుతున్న మృతదేహాన్ని గురువారం మేకల కాపరి గుర్తించి స్థానికులకు తెలిపాడు. దీంతో మృతుడు అమెర్ద గ్రామ పంచాయతీ కొర్సవారిగూడెం గ్రామానికి చెందిన గొంది వీరయ్య(60)గా గుర్తించారు. అమ్మగారిపల్లిలో ఒకరి ఇంట్లో పని చేస్తున్నాడని, భోగి పండుగ రోజు యజమాని ఇంటి నుంచి వెళ్లిపోయాడని, అనంతరం కనిపించలేదని స్థానికులు చెబుతున్నారు. స్థానికులు అశ్వాపురం పోలీసులకు సమాచారం అందించారు.

యువకుడి ఆత్మహత్య

జూలూరుపాడు: ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. హెడ్‌కానిస్టేబుల్ అజ్మీర బుచ్చయ్య కథనం ప్రకారం.. మండలంలోని భోజ్యాతండా గ్రామ పంచాయతీ వెనకతండాకు చెందిన భూక్యా హరిబాబు (21) తండ్రి నర్సింహారావు మూడేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి హరిబాబు మనోవేదనతో మానసికంగా కుంగిపోయాడు. తండ్రి లేని బతుకు తాను బతకలేనంటూ అంటుండగా తల్లి, కుటుంబసభ్యులు నచ్చచెబుతూ మనోధైర్యం కల్పిస్తున్నారు. కాగా బుధవారం రాత్రి పురుగుల మందు తాగి అపస్మారకస్థితిలో ఇంట్లో పడి ఉన్నాడు. గమనించిన కుటుంబీకులు కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడి తల్లి పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ బుచ్చయ్య తెలిపారు. మృతదేహాన్ని జూలూరుపాడు ఎంపీపీ లావుడ్యా సోనీ, భోజ్యాతండా సర్పంచ్ లావుడ్యా కిషన్‌లాల్, బీఆర్ఎస్ నాయకులు రాంశెట్టి రాంబాబు, ధర్మరాజుల వెంకటనారాయణలు సందర్శించి, సంతాపం తెలిపారు.

హోటల్ యజమాని..



రామచంద్రయ్య (ఫైల్)

ఇల్లెందు : కుటుంబ కలహాలతో ఇల్లెందుకు చెందిన హోటల్ యజమాని ఆత్మహత్య చేసుకున్న సంఘటన కారేపల్లి మండలంలోని శాంతినగర్‌లో గురువారం చోటుచేసుకుంది. శాంతినగర్‌కు చెందిన కొందూరి రామచంద్రయ్య(58) కొంత కాలంగా ఇల్లెందు పట్టణంలో ఉంటూ డీ బ్లాక్ వద్ద హోటల్ నడుపుతున్నాడు. కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది డీ బ్లాక్ సమీపంలోని మామిడితోట(శాంతినగర్)లో చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కారేపల్లి ఎస్ఐ పి.రామారావు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రేషన్ షాపు సీజ్

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని త్రివేణి పాఠశాల ముందు ఉన్న పూనెం సారయ్య రేషన్ షాపులో విజిలెన్స్ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. నిల్వల్లో 22.10 క్వింటాళ్ల బియ్యం తేడా ఉండటంతో షాపును సీజ్ చేసినట్లు సివిల్స్ సప్లయీస్ అధికారి సోయం కృష్ణ తెలిపారు. 6ఏ కేసు నమోదు చేశారు. విజిలెన్స్ సీఐ అన్నన్, కానిస్టేబుల్ రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

ADMISSIONS

■ Admissions for Guidence B.Sc., M.Sc. అగ్రి, L.L.B., B.Tech., M.Tech., MBA, P.Hd., all Few Seats available. Cont. : 9494903629, 9247298351. [M-8484]

Real Estate

FLAT FOR SALE

■ HYD-గచ్చిబౌలి @ కొల్లూరు 60 లక్షల నుండి ప్రారంభం. 2, 3BHK, HMDA/RERA Flats 3 acrs గేటెడ్ కమ్యూనిటీ లో ORR & 100Ft. రోడ్డు పేసింగ్. ఫోన్ : 9030258187. [HA-89726]

■ ఖమ్మం, పర్ణశాల ఎదురుగా, వైరా రోడ్ సమీపంలో న్యూ ఇరా స్కూల్ ప్రక్కన నిర్మించిన రెయిన్‌బో తులసి ఎలైట్ అపార్ట్‌మెంట్ నందు రెడీటు ఆక్యుపై 2 BHK ఫ్లాట్స్ అమ్మబడును. సంప్ర. 7799830620. [M-1190502]

Services

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థలలో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) సంప్రదించండి: 96590 57777. [M-8486]

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్. ✆ 76508 91999 [B-786661]

ఆయుర్వేదాలయం

■ అన్ని రకముల మందులు, కీళ్ల నొప్పులు, ఉబ్బసం, చర్మ వ్యాధులు, పైల్స్, మధుమేహం, సెక్స్ సమస్యల ప్రభావవంతమైన ఫలితం, వాజీకరణం. సెల్: 7738897455 [K-1141937]

ఆయుర్వేదం

■ బొల్లి, తెల్లమచ్చలు, సోరియాసిస్‌లకు ఎటువంటి పత్యం లేని చికిత్స కలదు. మందులు ఉచితముగా ఇవ్వబడను. సంప్ర: 9603055647, 7995392747 [G-888]

Wanted

■ ఖమ్మం పరిసర ప్రాంతాలలో అనుభవం కలిగిన ఫీల్డ్ ఆఫీసర్ మరియు సెక్యూరిటీ స్త్రీ/పు కావలెను. డ్యూటీ : 12 గం॥లు, జీతం: 10 వేలు, వ: 50 సం॥ లోపు. 9652832478, 7036191924. [M-1190503]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-776049]

■ హైదరాబాద్‌లో ఇంటిపనికి, వంటపనికి, తోటపనికి, పెంపుడు జంతువులను చూసుకొనుటకు స్త్రీలు, పురుషులు, భార్య-భర్తలు & డ్రైవర్లు కావలెను. జీతం: 9 వేలు-12 వేలు, ఉచిత వసతి + భోజనం కలదు. సంప్ర: 9550071630, 9701391347. [H-786820]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
ఖమ్మం - 9705444182
9010299957
కొత్తగూడెం-9010223783
భద్రాచలం - 9951602914
సత్తుపల్లి - 96528368642

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.